క్లుప్తంగా

ఎస్‌జీఎఫ్ జిల్లా పోటీలకు బొండాడ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కాళ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా పోటీలకు బొండాడ హైస్కూల్ విద్యార్థులు 59 మంది ఎంపికయ్యారని స్కూల్ హెచ్‌ఎం పి.మోహన్ రావు గురువారం చెప్పారు. పాలకోడేరు మండలం శృంగవృక్షం హైస్కూల్‌లో ఈ నెల 20న జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో టెన్నికాయిట్, త్రోబాల్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. టెన్నికాయిట్ బాలుర విభాగంలో 14 మంది, బాలికల విభాగంలో 14 మంది, త్రోబాల్ బాలుర విభాగంలో 17 మంది, బాలికల విభాగంలో 14 మంది ఎంపికైనట్లు వివరించారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు కె.విజయశ్రీ, పాఠశాల విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేత

సాక్షి, భీమవరం: పట్టణంలో ప్రింటింగ్ ప్రెస్ ద్వారా ఎంతోమందికి జీవనోపాధి కల్పించిన నాయుడు శివప్రసాద్ పలువురికి ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, కోడే యుగంధర్ అన్నారు. గురువారం శివప్రసాద్ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నాయుడు నాగేంద్ర, అయ్యప్ప, చెరుకువాడ రంగసాయి, కోమటి రాంబాబు, శివసాయి పాల్గొన్నారు.

26న వాహనాల వేలం

సాక్షి, భీమవరం: ఎక్సైజ్ నేరాల్లో సీజ్ చేసిన మూడు మోటారు సైకిళ్లను ఈ నెల 26న బహిరంగ వేలం వేయనున్నట్లు భీమవరం ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వర్మ గురువారం చెప్పారు. భీమవరం ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు రెండు స్కూటర్లు, ఒక మోటారుసైకిల్‌కు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. వేలంలో పాల్గొనేందుకు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని, పాటదారులు పాడుకున్నధరకు అదనంగా 18శాతం జీఎస్‌టీ చెల్లించాలని వర్మ తెలిపారు.

అప్పు ఇవ్వలేదని చాకుతో దాడి

ఉండి: అప్పు ఇవ్వలేదని చాకుతో దాడి చేయడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. పాములపర్రుకు చెందిన పాగిరి హరీష్ వద్దకు ఈ నెల 19న అదేగ్రామానికి చెందిన బత్తల భార్గవ్ వచ్చి సెల్‌ఫోన్ తాకట్టు పెట్టుకుని రూ.40 వేలు అప్పు ఇవ్వాలని కోరగా హరీష్ నిరాకరించాడు. ఇదిలా ఉండగా, గురువారం గ్రామంలోని ఓ సెలూన్ షాప్ వద్ద హరీష్ ఉండగా, భార్గవ్ వచ్చి అతనితో గొడవ పెట్టుకుని చాకుతో దాడి చేశాడు. దాడిలో తీవ్రగాయాలపాలైన అతనిని చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి వచ్చిన సమాచారం మేరకు ఏఎస్సై ఎ.సూర్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

ఆకివీడు: దాడి ఘటనపై పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై బి.నాగబాబు గురువారం చెప్పారు. మండలంలోని అజ్జమూరు, గుమ్ములూరు గ్రామాలకు చెందిన వ్యక్తులు పాత గొడవలను పురస్కరించుకుని ఈ నెల 20న ఘర్షణ పడి రాడ్లతో, ఇటుకులతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. గాయపడిన పలువురు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒక వర్గానికి చెందిన పీతల ఏసుదాసు, మరో వర్గానికి చెందిన మండా రాజేష్ ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సమాజంలో మానవత్వాన్ని పెంపొందించాలి

ఉండి: సమాజంలో మంచిని, మానవత్వాన్ని పెంపొందించేలా ప్రతి పాస్టర్ పనిచేయాలని మహిమ అగ్ని పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు పాస్టర్ జాన్‌పాల్, పాస్టర్ ఆదాము అన్నారు. రామచంద్రాపురం పాస్టర్ కే సత్యానందం చర్చ్‌లో పాస్టర్స్ ఫెలోషిప్‌ను పాస్టర్ ఆదాము గురువారం ప్రారంభించి మాట్లాడారు. పాస్టర్లంతా ఐకమత్యంగా ఉండి దేవుని మాటల ద్వారా సమాజంలో శాంతి సంతోషాలు నింపాలన్నారు. మానవత్వంతో జీవించి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. రాజేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో పలువురు వృద్ధులు, రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫెలోషిప్ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఊరూరా చవితి సందడి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో గ్రామగ్రామానా వినాయక చవితి నవరాత్రి మహోత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం ఉత్సవాల వేదికల వద్ద స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమవరంలోని మెంటేవారి తోటలోని శ్రీబాలత్రిపుర సుందరిదేవి అమ్మవారి దేవాలయంలోని విజయ గణపతి విగ్రహం వద్ద వినాయక చవితి వేడుకలలో భాగంగా 80మంది చిన్నారులతో బాల గణ పతి పూజ నిర్వహించారు. అర్చకులు మధిర సోమన్న, కొమ్ము శ్రీనివాస్ అధ్వర్యంలో దాతలు చినిమిల్లి శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, దొడ్డ గాయత్రీ, తలగళ్ళ వెంకటేశ్వర రావు, పావని సత్య దంపతులతో గణపతి పూజ, అభిషేకాలు, గరిక పూజ, నవగ్రహ పూజలను నిర్వహించారు. పూజలో పాల్గొన్న చిన్నారులకు విద్యా సామగ్రిని అందించారు. అధిక సంఖ్య లో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.


మెంటేవారితోటలో బాల గణపతి పూజలో పాల్గొన్న చిన్నారులు

రూ.1.60 లక్షలు పలికిన 5 కిలోల గణపతి లడ్డూ

కాళ్ల: గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా స్వామివారి లడ్డూ ప్రసాదాన్ని వేలం పాటలో రూ.1.60 లక్షలకు ఓ భక్తుడు పాడి దక్కించుకున్నాడు. కలవపూడిలో ఏర్పాటు చేసి న వినాయక మండపం వద్ద లడ్డూ ప్రసాదం వేలం పాటను గురువారం నిర్వహించారు. గ్రామానికి చెందిన మంతెన శేషురాజు 5 కిలోల లడ్డూ ప్రసాదాన్ని రూ. 1.60 లక్షలకు దక్కించుకున్నాడు. అతనిని ఆలయ ధర్మకర్త మంతెన సాయికృష్ణంరాజు, గ్రామపెద్దలు, కమిటీ నిర్వా హకులు అభినందించారు. నాలుగో వార్షికోత్సవం సందర్భంగా తొలుత స్వామివారికి నిత్య పూజలు చేసి అన్నసమరాధన నిర్వహించారు.


వేలంపాటలో లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్న భక్తుడు మంతెన శేషురాజు


కాళ్లలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

గరికతో అలంకరణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం సుంకర పద్దయ్య వీధిలోని వరసిద్ధి వినాయ కుని దేవాలయంలో గణపతి నవరాత్ర ఉత్సవాల లో గరికతో గణనాథుని తొండానికి అలంకరణ చేశారు. అర్చకులు బ్రహ్మజోస్యుల మణికంఠ శర్మ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో స్వామివారికి పంచామృతాలతో రుద్రాభిషేకం, లక్ష గరికపూజ, గరికతో అలంకరణచేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నా రు. అదే విధంగా గునుపూడిలోని విద్యాగణపతి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించి అటుకులతో అలంకరణ చేశారు.


గరికతో గణనాథుని అలంకరణ దృశ్యం

కాళ్లలో అన్నసమారాధన

కాళ్ల: కాళ్లలోని లంకరోడ్డు సెంటర్‌లో కదలి దుర్గాప్రదీప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకుని 19వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్వామివారికి పలు రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ యువత ఆధ్యాత్మిక కార్యక్రమంలో చురుగ్గా వ్యవహరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

ఉండి ఏఎంసీ చైర్మన్‌గా వెంకటేశ్వర్లు

- 24న కొత్త పాలకవర్గం ప్రమాణ స్వీకారం


బొక్కా వెంకటేశ్వర్లు


చేకూరి రాజా నరేంద్రకుమార్

ఉండి: ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డుకు 2023-24కు గాను కొత్త పాలకవర్గాన్ని ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఉండి ఏఎంసీ నూతన చైర్మన్‌గా బొక్కా వెంకటేశ్వర్లు (మహదేవపట్నం), వైస్ చైర్మన్ చేకూరి రాజానరేంద్రకుమార్ (గొల్లలకోడేరు), సభ్యులుగా నిమ్మల సత్యనారాయణ (ఉప్పులూరు), కానుబోయిన నాగమణి (కలిసిపూడి), బొడ్డు రామకృష్ణ (యండగండి), గుండు నాగేశ్వరరావు (కోరుకొల్లు), అంగర భాగ్యలక్ష్మి (ఉండి), సిరికి కుమారి (ఉండి), షేక్ రేష్మాబీబీ (ఉండి), బొడ్డు నాగన్న(చెరుకువాడ), గొట్టుముక్కల బంగారమ్మ (ఉండి), పాలకోడేరు కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, డీఏటీఎంఏ భీమవరం, ఏడీ అగ్రికల్చర్, ఉండి సర్పంచ్ సభ్యులుగా ఉన్నారు. ఈ నెల 24న వీరు ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వపు విద్యార్థులు, ఆదర్శ లయన్స్ క్లబ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన నీటిశుద్ధి ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. రూ.లక్షా యాభై వేల వ్యయంతో ప్లాంట్‌ను నిర్మించినట్లు ప్రిన్సిపాల్ కె.సుజాత చెప్పారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డకు ఆరోగ్యం

ఉండి: తల్లీబిడ్డా క్షేమంగా ఉండాలంటే తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాల్సిందేనని సీడీపీఓ వాణీ విజయతరత్నం అన్నారు. గురువారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కృషీ విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్లకు పోషణ మహా కార్యక్రమం అమలుపై ప్రత్యేక అవగాహనా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ, బాలింత తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని అన్నారు. వీరికి అంగన్‌వాడీలు సరైన అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలు, అలాగే 7వ నెల నుంచి 24 నెలల వరకు పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న వెయ్యిరోజుల పోషక మహా కార్యక్రమ ఉద్దేశాలను తప్పకుండా తెలుసుకుని, ప్రతి ఒక్కరికీ తెలియచేయాలని అన్నారు. చాలా మంది గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారంపై నిర్లక్ష్యం వహిస్తున్న దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశిస్తున్న వాటిని ఎప్పటికప్పుడు వారికి వివరించాలని సూచించారు. అనంతరం కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు, హోంసైన్సు శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.దెబోరా మెస్సియానా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. చిరుధాన్యాలను వాడితే మరింత బలంగాను, ధృఢంగా తయారవుతారన్నారు. అలాగే వైద్యులు, అధికారుల సూచనలు, సలహాలను పాటిస్తూ ఉంటే అన్నీ సుఖప్రసవాలే జరుగుతాయని, అప్పుడు తల్లీబిడ్డా చాలా క్షేమంగా ఉంటారని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.


కేవీకేలో పోషకాహారం ఆవశ్యకతను వివరిస్తున్న సీడీపీఓ వాణీవిజయరత్నం, కేవీకే శాస్త్రవేత్తలు

నేటి నుంచి సామూహిక ఎలుకల నిర్మూలన

ఆకివీడు: ఖరీఫ్ సాగులో ఎలుకల బెడద తొలగించేందుకు రైతులు సామూహికంగా నిర్మూలనా కార్యక్రమాన్ని చేపట్టాలని ఏఓ ప్రియాంక గురువారం సూచించారు. మండలంలో ఈ నెల 22, 23 తేదీల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. 22వ తేదీన రైతులు తమ పొలాల్లోనూ, సమీప ఖాళీ ప్రదేశాల్లో ఎలుకల కలుగులు గుర్తించి వాటిని పూడ్చివేయాలన్నారు. 23న సరఫరా చేసే బ్రొమోడయోలిన్ ఎర మందును ఆయా కలుగుల్లో వేసి, మళ్లీ పూడ్చివేయాలని సూచించారు. ఆయా ఆర్బీకేల వద్ద ఎలుకల మందు తయారీ, సరఫరా చేయనున్నట్లు చెప్పారు. దిగుబడులను అధిగమించేందుకు రైతులు, ఆర్బీకే చైర్మన్లు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఏఓ విజ్ఞప్తి చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

సాక్షి, భీమవరం: పట్టణంలోని వన్‌టౌన్‌కు చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఏఎస్సై రామకృష్ణ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని 15వ వార్డుకు చెందిన 15 ఏళ్ల బాలిక ఈనెల 17న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం తెలిసిన వారు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంపీపీ సహకారంతో పాఠశాల ఆవరణ మెరక

ఉండి: వర్షాల కారణంగా ఉండి ఎంపీపీ మెయిన్ స్కూల్ ఆవరణ వర్షం నీటితో నిండిపోవడంతో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు ఆవరణను బాగుచేసే కార్యక్రమాన్ని సొంత ఖర్చుతో చేపట్టారు. గురువారం పాఠశాల ఆవరణలోని వర్షపునీరు నిల్వ లేకుండా సుమారు రూ.15 వేల ఖర్చుతో నల్ల గ్రావెల్‌ను ఆవరణ అంతా పరిపించారు. దీంతో పాఠశాల ఆవరణ వర్షపునీరు లేకుండా పరిశుభ్రంగా మారింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో వర్షపు నీరు చేరడంతో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఉపాధ్యాయులు తన దృష్టికి తేవడంతో వెంటనే పరిష్కార చర్యలు చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడ్పాటుగా తాను కూడా ముందుకు వచ్చినట్లు ఎంపీపీ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఎంపీపీకి కృతజ్ఞతలు తెలిపారు.


ఉండి మెయిన్ స్కూల్‌లో మెరక పనులు చేయించిన ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

గాంధీ జయంతి పక్షోత్సవాల ప్రారంభం

సాక్షి, భీమవరం: సత్యం, శాంతి, అహింస ఆయుధాలుగా గాంధీజీ దేశానికి స్వాతంత్య్రం సాధించారని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భానునాయక్ అన్నారు. పట్టణంలోని క్విట్ ఇండియా స్తూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, జిల్లా సర్వోదయమండలి అధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాత్మాగాంధీ జయంతి పక్షోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. సబ్‌ట్రెజరీ ఆఫీసర్ అల్లూరి రవి వర్మ మాట్లాడుతూ గాంధీజీ నాయకత్వంలో అనేక మంది స్వాతంత్య్ర ఉద్యమానికి అండగా నిలిచారని అటువంటి మహనీయులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 31 వరకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలు, కళాశాలలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు, సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు. అక్టోబర్ 1వ దేశ నాయకుల స్ఫూర్తితో ర్యాలీ, 2న క్విట్ ఇండియా స్తూపం వద్ద జయంతి ముగింపు వేడుక, గాంధేయవాదులకు సత్కారాలు, విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాస్, చుక్కన శ్రీ, చాన్ పాషా, బి పద్మ తదితరులు పాల్గొన్నారు.


క్విట్ ఇండియా స్తూపం వద్ద కార్యక్రమం దృశ్యం

గొప్ప సంఘ సంస్కర్త.. గురజాడ

ఆకివీడు: దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అంటూ ఎలుగెత్తి చాటిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు అని ప్రిన్సిపాల్ కె.సుజాత కొనియాడారు. దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ అప్పారావు జయంత్యుత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో మూఢనమ్మకాలు, దురాచారాల నుంచి ప్రజల్ని బయటకు తీసుకువచ్చేందుకు తన రచనల ద్వారా ఎలుగెత్తి చాటిన గొప్ప సంఘ సంస్కర్త గురజాడ అన్నారు. కన్యాశుల్కం నాటకం ద్వారా సమాజంలోని రుగ్మతల్ని గురజాడ కడిగివేశారని అన్నారు. తెలుగు అధ్యాపకులు ఓగేశ్వరరావు మాట్లాడుతూ మూఢనమ్మకాలపై ఎక్కుపెట్టిన అస్త్రం అప్పారావు సాహిత్యం అని కొనియాడారు. ఆయన రచనలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆర్‌ఆర్‌డీఎస్'లో గురజాడ జయంతి

సాక్షి, భీమవరం: సాహిత్యమే ఆయుధంగా సాంఘిక దురాచారాలను అంతమొందించిన మహాకవి గురజాడ అప్పారావు అని ప్రజాకళాకారుడు చైతన్యప్రసాద్ అన్నారు. పట్టణంలోని ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన గురజాడ జయంతి సభలో ఆయన మాట్లాడారు. కళాశాల తెలుగు అధ్యాపకుడు కాకుమాని శ్రీనివాసరావు మాట్లాడుతూ సాహిత్యంతో సమాజ గమనాన్ని మంచి వైపు తిప్పి ఆచలనాన్ని వేగవంతం చేసిన కవినే మహాకవి అంటారన్నారు. గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీకాంతం, పి.రాజశేఖర్, సీహెచ్‌వీవీ సత్యనారాయణ, జి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.


గురజాడ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎన్నార్పీ అగ్రహారంలో శాంతి ర్యాలీ


ఎన్నార్పీ అగ్రహారంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

ఉండి: అందరూ ప్రపంచ శాంతిని కాంక్షించాలని లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు సత్తి బ్రహ్మారెడ్డి, గాదిరాజు రంగరాజు అన్నారు. గురువారం ఎన్నార్పీ అగ్రహారంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో కలసి లయన్స్‌క్లబ్ ప్రతినిధులు శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో హెచ్‌ఎం ఎంవీ సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ శాంతి సంతోషాలతో దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రపంచ శాంతిపై వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి రుద్రరాజు నరసరాజు ఆర్థిక సహకారంతో బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు పాలతీర్థపు నర్సింగరావు, భూపతిరాజు హరనాథరాజు, బొండాడ సూర్యబ్రహ్మానందం, పెన్మత్స రంగప్రసాద్‌రాజు, ఉపాధ్యాయులు పెన్మత్స వెంకట పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతుల అందజేత

వీరవాసరం: చింతలకోటి గరువులో శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వార్షికోత్సవాల్లో భాగంగా మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యాన శిక్షణ, చిన్నారుల కోలాట నృత్య ప్రదర్శన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-ఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ పాల్గొని జ్ఞాన బోధ చేసి అందరితో ధ్యానం చేయించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 2005 సంవత్సరంలో చింతలకోటిగర్వులో ఇదే వేదికపై బ్రహ్మర్షి పత్రీజీ ఆదేశంతో శ్రీగణేష్ పిరమిడ్ ధ్యానయజ్ఞం నిర్వహించి వీరవాసరం మండల పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీని స్థాపించారన్నారు. అప్పటి నుంచి మండలంలోని ప్రతి గ్రామంలోను ధ్యానాన్ని, శాకాహారం ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగిందని గుర్తు చేశారు. సర్పంచ్ దాసరి మహాలక్ష్మి చిన్నారులకు బహుమతులు అందజేశారు. శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి కమిటీ సభ్యులు యిర్రింకి ప్రవీణ్, కానుకొలను రమేష్, ఏలూరి శ్రీనివాస్, వాకల చందు, ముద్రగళ్ళ మణికంఠ, డాన్స్ మాస్టర్ నార్కెడిమిల్లి రేవతి, గ్రామప్రజలు పాల్గొన్నారు.


బహుమతులు అందుకుంటున్న చిన్నారులు

దళిత రక్షణ యాత్ర ప్రారంభం

సాక్షి, భీమవరం: కేంద్రంలోని బీజేపీ పాలనలో దళితులకు రక్షణ కరువైందని, ఈ తరుణంలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధమవ్వాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్రా మాల్యాద్రి కోరారు. కేవీపీఎస్, వ్యకాస ఆధ్వర్యంలో చేపట్టిన దళిత రక్షణ యాత్రను గురువారం పట్టణంలో అంబేడ్కర్ సెంటర్ వద్ద ఆయన ప్రారంభించారు. కె.క్రాంతిబాబు, జక్కంశెట్టి సత్యనారాయణ, గంటా సుందర్‌కుమార్, డి.కల్యాణి పాల్గొన్నారు.

ఉండిలో..

ఉండి: కేవీపీఎస్, వ్యకాస చేపట్టిన దళిత రక్షణ యాత్ర గురువారం సాయంత్రం ఉండి సెంటర్‌కు చేరుకుంది. కే క్రాంతిబాబు, సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం దేశంలో పేదల సొమ్మును పెద్దలకు దోచిపెడుతోందని ఆరోపించారు. బత్తుల విజయకుమార్, బాతిరెడ్డి జార్జ్, కింతాడ రమేష్, చైతన్యప్రసాద్, షేక్ వలీ పాల్గొన్నారు.

దళిత చట్టాలు, సంక్షేమాన్ని నీరుగారుస్తున్న కేంద్రం

ఆకివీడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దళిత చట్టాలు, సంక్షేమాన్ని నీరుగారుస్తోందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు ఆవేదన వ్యక్తం చేశారు. కెవీపీఎస్, వ్యకాస దళిత రక్షణ యాత్ర గురువారం రాత్రి ఆకివీడు చేరుకుంది. క్రాంతి బాబు మాట్లాడుతూ దళితులకు రక్షణగా ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నాలు చేస్తున్నారని వాపోయారు. బాతిరెడ్డి జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, విజయకుమార్ పాల్గొన్నారు.

మార్చిలో విష్ణులో ఎలక్ట్రిక్ బాజా పోటీలు

సాక్షి, భీమవరం: పట్టణంలోని విష్ణు కళాశాలలో జాతీయ స్థాయి ఎలక్ట్రిక్ బాజా చాంపియన్‌షిప్-2024 నిర్వహించడానికి బాజా ఎస్ఏఈ ఇండియాతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కేవీ విష్ణురాజు గురువారం చెప్పారు. వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించే ఈ పోటీలకు గురువారం బాజా ఎస్ఏఈ ఇండియా చైర్మన్ సంజయ్ నిబంధేతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకున్నామన్నారు. సంజయ్ నిబంధే మాట్లాడుతూ ప్రస్తుతం పారిశ్రామికరంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు ఆచరణాత్మక పరిష్కారాన్ని కనుగొనడంలో ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు తమవంతు పాత్ర పోషిస్తారన్నారు. నాలుగు రోజులు జరిగే ఈ పోటీల్లో పాల్గొనేందుకు మొత్తం 85 జట్లు పేర్లను నమోదు చేసుకున్నాయన్నారు. విద్యార్థుల ప్రదర్శన ఆధారంగా విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. విష్ణు వైస్ చైర్మన్ ఆర్.రవిచంద్రన్, కేసీ వోరా, ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కూలీకి తీవ్ర గాయాలు

ఉండి: చెరుకువాడలో బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. ఈ నెల 19న జరిగిన ఈ ప్రమాదంపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఎన్.సుబ్బారావు చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కలిగొట్లకు చెందిన పులఖండ సంజీవరావు స్నేహితుడు యోహానురాజుతో కలసి 19న ఉదయం బైక్‌పై చేపల ప్యాకింగ్ పని నిమిత్తం ఆకివీడు వెళుతున్నారు. చెరుకువాడ చేరుకోగానే ఆకివీడు నుంచి ఎదురుగా వస్తున్న లారీ వీరిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో వెనుక కూర్చున్న సంజీవరావు కుడి కాలుకు తీవ్ర గాయాలు కాగా, బండి నడిపిన యోహానురాజు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సంజీవరావును భీమవరం తీసుకువెళ్లగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

